# ట్రాజడీ

పేపర్లు దిద్దటానికి కర్నూలు వెళ్ళినపుడు 'స్పాట్ వాల్యుయేషన్ సెంటర్'లో రామారావుగారు కనిపిస్తే పల్కరిద్దామని దగ్గరగా వెళ్ళాను. చదువుకొనే రోజులలో నాకు అయన గురువు. లెక్కలు చెప్పటానికి వచ్చేవాడు. చాలా మొద్దువాడికి కూడా చక్కగా అర్థమయ్యేలా చెప్పే నేర్పరి ఆయన. "రామారావు మేడీజీ" అనుకొనేవాళ్ళం అప్పట్లో మేము నేను ఉద్యోగంలో ప్రవేశించిన తర్వాత కూడా ఆయన కనిపించినపుడల్లా ఎంతో ఇష్టంగా పలకరించేవాణ్ని. నిరుడు పేపర్లు దిద్దటానికి చిత్తూరు వెళ్ళినపుడుకూడా అయన వచ్చారు. అయనకింక నాలుగయిదు సంవత్సరాలు సర్వీసు వుండొచ్చు.... అయినా చాలా ఉత్సాహంగా, చలాకీగా ఉంటారు.

ఆయన మరెవరితోనో మాటాడుతున్నారు. ఆయన పక్కన మరో పదహారేళ్ళ కుర్రాడు కూడా ఉన్నాడు. ఆయన చేతిలో వంకీకర్ర వుంది. మనిషి కొంచెం అలిసినట్టు కన్పించారు.

దగ్గరికి వెళ్ళి "నమస్కారం సార్" అన్నాను. మాటలు ఆపి ఆయన నా వేపు చూసి "ఓ....నువ్వా మూర్తీ! ఎప్పుడు వచ్చావ్! పేపర్లు దిద్దటానికేనా?" అన్నారు భుజంమీద చేయి వేసి.

నేను అవునన్నట్టు తలూపి ఆయన కాలువేపు చూస్తూ "ఏమిటిసార్! కర్ర పట్టుకున్నారు" అనడిగాను.

"నెలక్రితం బాత్ రూమ్‌లో జారిపడ్డాను మూర్తీ! తుంటి ఎముక డిసార్డరయింది...."

"అయ్యో! బాత్ రూమ్‌లోపడ్డారా! బాగా దెబ్బ తగిలిందా?"

"ఆఁ.... బాగానే దెబ్బ తగిలింది.... చాలా బాధపడ్డాను నెల్లాళ్ళు"

"ఎక్కడికీ వెళ్ళి కట్టు కట్టించుకోలేదా?"

"పుత్తూరువెళ్ళి కట్టు కట్టించుకున్నాను. అయినా సరిగాకుదురుకోలేదు. ఈవైపు పొడుచుకొని కనిపిస్తూంది చూడు...." అంటూ నాచేతిని పట్టుకొని తుంటిఎముకకు తాకించారు. ఆ ప్రదేశంలో ఎముక ఉబ్బెత్తుగా చేతికి తగిలింది.

"నొప్పిగా ఉంటుందా సార్" అనడిగాను.

"నొప్పి లేదుగాని నడవటానికే యిబ్బంది. కర్రసాయం లేకపోతే నడవటం కష్టం. వేగంగా నడవటం అసలు సాధ్యంగాదు. మెట్లెక్కాలన్నా, దిగాలన్నా చాలా యిబ్బంది. ఎందుకైనా మంచిదని మా అబ్బాయిని కూడా వెంటతీసుకొచ్చాను" అన్నారు పక్కనున్న కుర్రాణ్ణి చూపిస్తూ.

తర్వాత ఆయన యిటూ అటూ నడుస్తూంటే చూశాను! నడకలో కొంచెం మార్పు కనపడింది.... కుంటి నడకే! అయ్యో అనిపించింది నా మనసుకి. ఆయన చాలా సిగ్గుపడుతున్నట్టే కనిపించారు.

"ఏమిటో ఈ ముసలి ముప్పున యిదొకటి వచ్చిపడింది" అన్నారు దిగులుగా. "జీవితం సాఫీగా వెళ్ళిపోతుంది అనుకున్నాను. కుంటిబతుకు రాశాడు నా మొహాన్న దేవుడు...."

"అబ్బే అలా బాధపడకండి సార్ మీ నడకలో నాకేం తేడా కనబడ్డంలేదే!"

“ఆఁ ఎందుకు లేవయ్యా హాస్యాలు! కుంటివాణ్ని కుంటివాడంటే తప్పేముందిలే” అంటూండగా ఆయన కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. “ఏ రోజుకు ఏం జరుగుతుందో చెప్పలేం. నా కాలు ఇలా అవుతుందని కలలోనన్నా అనుకోలేదు”

“ఎక్కడ దిగారు?” అన్నాను ఆయన ధోరణి మార్చాలని.

“రాక్‌వుడ్ హైస్కూల్లో.... రావటం కూడా ఉదయమే! నువ్వెక్కడ దిగావు?”

“మునిసిపల్ హైస్కూల్‌లో” అన్నాను.

ఇలాంటివే మరో పది నిమిషాలు మాటాడుకొని ఎవరి గదులకు వాళ్ళు వెళ్ళిపోయాము. పాపం ఆయన కుంటుతూ అడుగులు వెయ్యటానికి సిగ్గుపడ్డట్టేవుంది.

వారం రోజుల తర్వాత సెంటర్ క్యాంటీన్‌లో కన్పించారు రామారావుగారు కాఫీ తాగుతూ.

నేనూ ఒక కప్పు కాఫీ పుచ్చుకొని ఆయన పక్కనే చేరాను.

“ఎన్ని పేపర్లు యిచ్చారోయ్....” అనడిగాడు మాటవరుసకు.

“ఇరవై యిచ్చారు. ఓ పది దిద్ది యిలా వచ్చాను” అని “మీ అబ్బాయి కనిపించటం లేదే” అనడిగాను.

“నిన్న హాస్పటల్‌కి వెళ్ళాను ఆర్థోపీడిక్ సర్జన్‌ను కలుద్దామని. ఆయనలేరు. ఈ రోజైనా వున్నారేమో కనుక్కు రమ్మని మావాణ్ని పంపించాను” అన్నారు.

“సర్జన్ దగ్గరికెందుకండీ! మళ్ళీ కాలు చూపించుకుంటారా?” అనడిగాను.

“అబ్బే... అదేంలేదు.... అలాంటిదే అంటూ ఏదో ఆయన నసిగారు.

ఇలా అంటున్నాడేమిటి అని నేను కొంచెం ఆశ్చర్యపడ్డాను. కాఫీలు తాగటం పూర్తిచేసి ఎవరి గదులకు వాళ్ళు వెళ్ళాము.

* * *

ఆరోజు "పెన్‌డౌన్ స్ట్రయిక్"

పేపర్లు దిద్దటానికి మాకిస్తున్న రెమ్యూనరేషన్ పెంచాల్సిందిగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని 'స్పాట్ వాల్యుయేషన్ సెంటర్ల'లోని ఉపాధ్యాయులందరూ పేపర్లు దిద్దటాన్ని బాయ్‌కాట్ చేశారు. మా సెంటర్‌లోని ఉపాధ్యాయులందరుమూ 'స్ట్రయిక్' లో పాల్గొన్నాం. అందువల్ల ఆరోజు మాకేం పనిలేదు.

ఏమీ తోచక నేనూ, నా సహోపాధ్యాయుడు రామకృష్ణా ఉదయం మ్యాట్నీకి వెళ్ళాం. మ్యాట్నీ చూసుకొని భోంచేయటానికి 'బృందావన్' వెళ్తుండగా దారిలో రిక్షాలో ఎదురుపడ్డాడు రామారావు మాష్టారు. రిక్షాలో ఆయన, ఆయన కుమారుడూ కూచొనున్నారు. నన్నుచూసి రిక్షా ఆపించారు రామారావుగారు.

"ఎక్కడికెళ్ళారు సార్?" నిలబడి మాటవరుసకు అడిగాను ఆయన్ను.

"హాస్పిటల్ నుంచీ వస్తున్నాం మూర్తీ" అన్నారాయన.

"సర్జన్‌ను కలిశారా?"

కలిశానన్నట్టు తలూపారాయన.

"ఏమన్నారు? కాలు తిన్నగా వస్తుందన్నారా?"

"అనటానికేముందిలే ... ఇప్పుడు తిన్నగా రాకపోతే ఏం కొంప మునిగిందిలే...." ఆయనాధోరణిలో మాట్లాడుతూంటే నేను ఆశ్చర్య పోయాను.

"అదేమిటిసార్ .... అలా అంటారు?" అన్నాను నేను.

"అదికాదోయ్...." అని ఆయన కొంచెం నసుగుతున్నట్టుగా "వారం క్రితం ఓ మిత్రుడు, చిన్న సర్టిఫికేట్ సంపాయిస్తే డబ్బొస్తుం

దన్నాడు. అందుకనీ....'' అని అనబోతుండగా నేను "డబ్బేమిటీ?" అన్నాను.

"అదేలే. కాలు విరిగి వచ్చిందిగా.... సర్టిఫికేట్ కోసం వెళ్ళాను. ఏదో ముడుపు చెల్లించి ఓ సర్టిఫికేట్ తెచ్చుకున్నాను.''

ఆయన చెబుతున్నదేమిటో నాకు వెంటనే అర్థంగాలేదు "సర్టిఫికేట్ ఏమిటి సార్?'' అనడిగాను.

ఆయన అదోలా నవ్వి "నేను వికలాంగుణ్ణని సర్టిఫికేట్ తెచ్చుకున్నానోయ్'' అన్నాడు.

ఆయనామాట చెప్పగానే నాకసలు విషయం వెంటనే అర్థమయింది... అంతర్జాతీయ వికలాంగుల సంవత్సరం సందర్భంగా వికలాంగులయిన ఉద్యోగులు, తాము వికలాంగులయినట్టు సర్జన్ ద్వారా సర్టిఫికేట్ తెచ్చి, మేనేజిమెంట్‌కు చూపిస్తే, అది ఆధారంగా ఆ ఉద్యోగికి అదనంగా నెలకు యాభయి రూపాయల చొప్పున అతడు ఉద్యోగంలో ఉన్నంత కాలమూ ఇస్తారు.

"ఏమిటోయ్ ఆశ్చర్యంగా చూస్తున్నావా? కాలు కొంచెం డిసార్డరయినందువల్ల వచ్చిన నష్టమేమిటి లెద్దూ! నడకకే గదా కొంచెం యిబ్బంది. ఈ కాలువల్ల అంతకంటే ఘనకార్యం ఏముందోయ్ చేయటానికి? విరిగితే విరిగిందిలే. దానితో నేనిప్పుడేమన్నా డాన్సు చెయ్యాలా.... ఏమంటావ్?''

"అదేమిటిసార్! కాళ్లున్న వాళ్ళంతా డాన్సులు చేస్తారా? నడవటానికి కాలుండాలికదా''

"అవుననుకో.... మరేం చేస్తాం, తీరా విరిగాక!"

ఆయనలా మాట్లాడుతుంటే నేను నిజంగా విస్తుపోయాను. అనగూడదుగాని కాలు విరిగినందుకు ఆనందిస్తోన్నట్టుగా కనపడ్డాడు ఆ మనిషి!

పదిరోజుల క్రితం ఎంత బాధపడ్డాడు- ఆ మనిషేనా ఈ మనిషి.... డబ్బు వస్తుందని ఎవరో చెప్పేసరికి కాలుతో ఏం చేస్తాంలెద్దూ అంటాడేమిటి?

"ఈ వయసులో నెలకి యాభై రూపాయలంటే మాటలా మూర్తీ! మా రెండో పిల్లకి కట్నం బాపతు సొమ్ము ఇంకా రెండు వేలివ్వాలోయ్! చిన్నాడికి కొంచెం డొనేషన్ కట్టాలి. వచ్చేది వానాకాలం.... చిరగని దుప్పటన్నది లేదనుకో కొంపలో. అద్దె పెంచమని పీకలమీద కూచున్నాడు ఇంటివాడు నెలనెలా. ఏం పెంచుతాం.... ఇప్పటిగే రెండు వందలిస్తున్నాం. రెండోపూట కాఫీ తాగాలన్నా బాధే.... నువ్వే చెప్పు మూర్తీ, ఈ వయసులో కాలుకంటే యాభై రూపాయలు విలువైనవా కావా....?"

ఆయనలా మాటాడుతుంటె నిజంగా నాకు జాలేసింది. ఆయనతో ఏం మాట్లాడటానికీ నాకు నోరు రాలేదు. ఆయన మాట్లాడినంతసేపూ మాట్లాడి "వస్తానోయ్ మూర్తీ! మళ్ళీ కలుద్దాం" అని చెప్పి ముందుకు సాగిపోయాడు.

నేను విషాదంగా మొహం పెట్టి పక్కనున్న నా మిత్రునివేపు చూశాను ముందుకు నడుస్తూ.

"ఏమిట్రా అలా మొహం వేలాడేశావ్" అనడిగాడు రామకృష్ణ.

"జీవితంలో ఇంతకంటే 'ట్రాజడీ' ఇంకేముందిరా...." అన్నాను.

"రేయ్! ఈ ధనస్వామ్య సమాజంలో ప్రతి మనిషీ ప్రతి అవకాశాన్నీ వీలుంటే 'కాష్' చేసుకోటానికే ఉపయోగించుకుంటాడు! ఇది నిజంగా పెద్ద ట్రాజెడీయే! ఇందుకు మనుషుల్ని మాత్రమే తప్పు పట్టకూడదు.... జాలి పడాలి. ఈ ట్రాజెడీ వ్యక్తిగతమయినదికాదు. సామాజికమైనది" అన్నాడు నా మిత్రుడు.

నేను ఒక క్షణం నిలబడి మళ్ళీ అడుగులు ముందుకు వేశాను. *

(రచనాకాలం : నవంబర్ 82 విపుల : ఫిబ్రవరి 83)